


చంటి ఆకలితో నకనకలాడుతున్నాడు వుదయం నించి.

"హీరోగారు వస్తున్నారుట."

"ఎప్పుడు?"

"బయలేరారట."

"అయితే ఇంకో అరవై నిముషాల్లో రావచ్చు."

"టైం ఎంతయింది?"

"పన్నెండుంముప్పావు."

చంటి పొద్దున్న ఎనిమిదిన్నరకి వచ్చాడు స్టుడియోకి. మిగతా ఎక్స్‌ట్రాలతో పాటు అతనికి కూడా మేకప్ చేసారు.

తొమ్మిదిన్నరకి రావాలి హీరో. ముప్పై నాలుగో సీన్ చిత్రీకరిస్తున్నారు ఆ రోజు. సాయంత్రం దాకా జరుగుతుంది చిత్రీకరణ. హీరోకోసం అంతా ఎదురుచూస్తున్నారు. ఆ చిత్రం పేరు "కోటలో రహస్యం".

చంటి వడపళని మార్కెట్ పక్కసందులోని ఓ చిన్న గదిలో మరో ముగ్గురు మేల్ ఎక్స్‌ట్రాలతో పాటు కలిసి వుంటున్నాడు. రోజూ టీ నగర్‌దాకా నడిచివెళ్ళి ఇద్దరు ముగ్గురు ఎక్స్‌ట్రా సప్లయర్లకి కనపడి వస్తూంటాడు.

ఆ రోజు టీ, బన్ తప్ప మరింకేం తీసుకోడానికి డబ్బులేకపోయింది చంటి దగ్గర. షూటింగ్ అవుతేకాని డబ్బు ముట్టదు. ప్రొడక్షన్ మేనేజర్ చుట్టూ తిరిగి షిఫ్ట్ డబ్బు సంపాదించుకునే నటన కూడా తెలిసి వుండాలి ప్రతి ఎక్స్‌ట్రాకి.

ఆ ముందు రోజు కూడా భోజనం లేదు చంటికి. చంటితో పాటు ఆ గదిలో వుండే మిగతా ముగ్గురి పరిస్థితి దాదాపుగా అలాగే వుంది.

పన్నెండూ ఏభైకి హీరోగారి కారు స్టుడియో ఆవరణలో ఆగింది. మేకప్‌రూంకి వెళ్ళారాయన. లంచ్ తీసుకుని, కాసేపు రిలాక్స్ అయి, మేకప్ వేసుకుని రెండూ ఇరవైకి బయటికి వచ్చాడాయన.

ఆయనకన్నా ముందే ఆయన మీల్స్ క్యారియర్ ఇంటి నుంచి వచ్చింది. అదీ అదృష్టం అంటే- చెప్పాడు చంటి తన మిత్రులకి, కడుపు నకనకలాడుతూంటే.

రెండున్నరకి షూటింగ్ ప్రారంభం అయింది. చంటి రక్షక భటుడి వేషంవేసాడు. జానపద చిత్రం అది.

షూటింగ్ పదిన్నరదాకా జరిగింది. ప్రొడక్షన్ వాళ్ళిచ్చే టీతప్ప మరేం చంటి కడుపులోకి వెళ్ళలేదు.

ప్రొడక్షన్ మేనేజర్ చంటికి డబ్బు ఇచ్చే సరికి పావుతక్కువ పన్నెండయింది. మిగతా ఎక్స్‌ట్రాలతో పాటు బయటకి నడిచాడు. ఆ సమయంలో భోజనం దొరకదు.

ఎదురుగావున్న టీ షాప్‌కి వెళ్ళి బన్, టీలతో కడుపు నింపుకున్నాడు మళ్ళీ.

"ఛీ ఛీ! ఆకలి బ్రతుకు" అనుకున్నాడు రాత్రి రెండున్నరకి, ఇంకా ఆకలి వల్ల నిద్ర పట్టకపోతే.

* * *

"బేరం కడతావా?"

"ఎక్కడికండి?"

"చుట్టుగుంట"

"రాదుసార్, జైహింద్‌టాకీస్ వైపయితే వస్తాను."

"రూపాయిన్నర ఇస్తాను."

"రాదండి."

వెంకన్న రిక్షాని సరాసరి బందర్ రోడ్‌లో వున్న యజమాని ఇంటికి ఖాళీగా తొక్కుకు వెళ్ళి రిక్షాని, ఆ రోజు అద్దెని యజమానికి అప్పచెప్పాడు.

బయటకి వచ్చి ఓ కట్ట గణేష్ బీడీ, అగ్గిపెట్టె కొన్నాడు.

వెంకన్న వుండేది కృష్ణలంకలో. కానీ వెంటనే ఇంటికి బయలుదేరలేదు. జేబులో మిగిలినడబ్బు లెక్కపెట్టుకుని కాసేపు ఆలోచించాడు.

అద్దె పోయాక ఆ రోజు రూపాయే మిగిలింది. మామూలుగా అయితే నూకలు కొనుక్కుని ముసలి తల్లి వుండే తన ఇంటికి బయలుదేరేవాడు కాని ఆ రోజు నూకలు కొనలేదు.

దగ్గరేవున్న సినిమా థియేటర్ వైపు నడిచాడు. బీడీకట్ట విప్పి, ఓ బీడీ వెలిగించి నేల క్లాసులోని క్యూలో నిలబడ్డాడు.

ఆ సినిమా విడుదలయి నాలుగు రోజు

లెంది. వెంకన్న అభిమాన హీరో నటించిన జానపద చిత్రం అది.

ఆకలిగా వుంది వెంకన్నకి. 'ఇంటర్వెల్‌లో బన్ కొనుక్కుని టీ తాగచ్చు' అనుకున్నాడు.

మర్నాడు వుదయం తను, తన ముసలి తల్లి పస్తు వుండాలన్న సంగతి గురించి ఆలోచించడంలేదు.

తను చూడబోయే సినిమా 'కోటలో రహస్యం' మీదే వుందతని ఆలోచనంతా ●

